వ్యాపార సముదాయాల ఎదుట

పరిశుభ్రతను పాటించాలి

పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న
సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ కె ఎస్ రవి

జూబ్లీహిల్స్,డిసెంబర్4: వ్యాపార సముదాయాల ముందు పరిశుభ్రతను పాటించాలని యూసుఫ్‌గూడ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ కె ఎస్ రవి పేర్కొన్నారు. సోమవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో వ్యాపార సముదాయాల ముందు పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నదీప్ సూపర్ మార్కెట్ ముందు అపరిశుభ్రతపై నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పరిశుభ్రత పాటిస్తామని యాజమాన్యంతో లిఖిత పూర్వకంగా సంజాయిషీ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎంఓహెచ్ డాక్టర్ రవి మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి దుకాణం ముందు చెత్త డబ్బాలు ఉంచి స్వచ్ఛ ఆటోలకు చెత్త అందజేయాలని సూచించారు.

ఎమ్మెల్యే వివేకానంద్‌కు శుభాకాంక్షలు

ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న
ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, తదితరులు

దుండిగల్,డిసెంబర్4: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించి, హ్యాట్రిక్ కొట్టిన శాసనసభ్యుడు కేపీ.వివేకానంద్‌ను ప్రభుత్వవిప్, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్‌రాజు సోమవారం కుత్బుల్లాపూర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం పట్ల పుచ్చగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, నేతలు ఉన్నారు.

గాంధీకి అభినందనల వెల్లువ..

అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను
గజమాలతో సత్కరిస్తున్న మియాపూర్ డివిజన్
బీఆర్ఎస్ నాయకుడు ఎండీ అన్వర్ షరీఫ్

మియాపూర్, డిసెంబర్ 4 : అసెంబ్లీ ఎన్నికలలో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా హ్యాట్రిక్ విజయం సాధించిన అరెకపూడి గాంధీకి అభినందనల వెల్లువ కొనసాగింది. ఈ మేరకు సోమవారం నియోజకవర్గంలోని పలు డివిజన్‌ల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు, కుల సంఘాల ప్రతినిధులు, మహిళా నేతలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే గాంధీ నివాసానికి విచ్చేసి ఆయన్ను ఘనంగా సన్మానించారు. మియాపూర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎండి అన్వర్ షరీఫ్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పార్టీ శ్రేణుల కృషి, నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలతోనే తాను మూడోసారి ఘన విజయం సాధించినట్లు పేర్కొన్నారు. తనను ఆదరించి ఆశీర్వదించిన ప్రజల సేవలో తరిస్తానని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పార్టీ కార్యకర్తల సంబురాలు

బోరబండ బస్ టెర్మినల్ వద్ద పార్టీ కార్యకర్తల సంబురాలు

ఎర్రగడ్డ, డిసెంబర్ 4: మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాన్ని సాధించటంతో పార్టీ కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో మిఠాయిలు పంచుతూ నినాదాలు చేశారు. ఇక బోరబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పటాకులు కాల్చి అందరూ బోరబండ బస్ టెర్మినల్‌కు చేరుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గులాబీ జెండాలు చేత బూని 'జై కేసీఆర్', 'జై గోపన్న' అంటూ నినాదాలు చేశారు. డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతున్న మాగంటి మరో సారి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని ముందే ఊహించామని పేర్కొన్నారు. కృష్ణమోహన్‌తో పాటు లక్ష్మణ్‌గౌడ్, శంకర్, ఆనంద్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో పెరగని ఓటింగ్ శాతం..

- బాధ్యతను విస్మరిస్తున్న ఓటరు
- ఓటేసేందుకు ఆసక్తి చూపని వైనం..

జూబ్లీహిల్స్,డిసెంబర్4: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రతి ఎన్నికలలో ఓటింగ్ శాతం అత్యల్పంగా నమోదుకావడం ఎన్నికల సంఘం అధికారులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది. విద్యావంతులతో పాటు పేద, ధనిక వర్గాలుండే ఈ ప్రాంతంలో ఎన్నికలు ఏవైనా ఓటింగ్ శాతం మాత్రం పెరగడం లేదు. అయితే అత్యధిక బస్తీలున్న ఈ నియోజకవర్గంలో ఓటు వేయడానికి సొంతూరుకు వెళ్ళే వారి సంఖ్య కూడా గణనీయంగా ఉండడంతో ఓటింగ్ శాతం తగ్గడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. ఎన్నికలపై అనాసక్తితో నగరంలోనే ఉన్నా గడప దాటని ఓటరుతో ఓటింగ్ శాతం తగ్గిపోతుంది. ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి బూడిదలో పోసిన పన్నీరుగా మారుతున్నాయి. గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో జూబ్లీహిల్స్‌లో కేవలం 47.49 శాతం ఓటింగ్ మాత్రమే నమోదయ్యింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,85,265 మంది ఓటర్లుండగా 770 పోస్టల్ బ్యాలెట్‌తో పాటు 1,82,567 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఎన్నికల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో 28,270 మంది ఓటర్లు పెరిగారు. అయితే ఓటర్లు పెరిగినా ఓటింగ్ శాతం మాత్రం పెరగలేదు.

ఓటను విస్మరిస్తున్నారు..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటు వేసిన వాళ్ళకంటే ఓటు వేయని వారు అధికంగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో 1,82,567 మంది ఓటు వేయగా 2,02,698 మంది ఓటు వేయలేదు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్న వివేచన ఉన్న విద్యావంతులైన ఓటర్లు బాధ్యతను విస్మరిస్తున్నారు. ప్రభుత్వం సెలవు ప్రకటించినా ఉద్యోగులు ఓటు వేసేందుకు అనాసక్తి కనబరుస్తున్నారు. దీంతో ప్రతి ఎన్నికలలో అత్యల్ప ఓటింగ్‌నే విజయం వరిస్తుంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి వెచ్చించాల్సిన ఒక గంట సమయాన్ని విశ్రాంతి తీసుకోవడానికో.. విహారానికి వెళ్లేందుకో వృథా చేస్తున్నారు. దీంతో ఐదు నిముషాలు ఆలోచించి ఐదేండ్లు మనలను పరిపాలించాల్సిన మంచి నేతను ఎన్నుకోవడంలో విఫలం అవుతున్నారు.

విజయవంతంగా ఎన్నికల ప్రక్రియ..

- తొలి సారిగా ఆర్‌వోగా జడ్సీ..
- స్థానికంగానే ఓట్ల లెక్కింపు..

డీఆర్‌సీలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఆర్‌సీ శ్రీనివాసరెడ్డి(ఫైల్)

మియాపూర్, డిసెంబర్ 4 : రాష్ట్రంలోనే అతి పెద్దదైన నియోజకవర్గం శేరిలింగంపల్లిలో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. తెలుగు రాష్ట్రాలలోనే పెద్ద నియోజకవర్గం కావటంతో అటు రాజకీయ ఇటు అధికార యంత్రాంగం దృష్టి దీనిపైనే ఉంది. రాజకీయ నేతలకు లక్షలల్లో ఉన్న ఓట్లను ఎలా రాబట్టుకోవాలనే లక్ష్యంతో పని చేయగా.. అధికార యంత్రాంగం వివాదరహితంగా ఎన్నికల ప్రక్రియను దిగ్విజయం చేయాలనే సంకల్పంతో పని చేసింది. మొత్తంగా అటు రాజకీయ ఇటు అధికార యంత్రాంగం లక్ష్యం నెరవేరింది. ప్రధానంగా ఇక్కడి నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి(ఆర్‌వో)గా జోనల్ కమిషనర్ వ్యవహరించారు. ఇలా జడ్సీ ఆర్‌వోగా వ్యవహరించిన తొలి ఎన్నిక ఇదే. ఇప్పటి వరకు శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ నే ఆర్‌వోగా ఉండగా.. ఈ సారి ఎన్నికలలో జడ్సీ ఆర్‌వోగా వ్యవహరించారు. 7.50 లక్షల పై చిలుకు ఓటర్లు.. 622 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియ జరిగింది. నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఏఆర్‌వోలు రజనీకాంత్ రెడ్డి, వంశీకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్ సహా ఇతర అధికార యంత్రాంగం, సిబ్బంది చిత్తశుద్ధితో తమ ఎన్నికల విధులను నిర్వర్తించారు. దీనికి తోడు నామినేషన్ల నుంచి ఓటింగ్, కౌంటింగ్ వరకు వేలాది మంది క్షేత్రస్థాయిలో అత్యంత పకడ్బందీగా పని చేయటంతో యావత్ ప్రక్రియ విజయవంతమైంది. ప్రధానంగా పెద్ద నియోజకవర్గమైన శేరిలింగంపల్లిలోనే కౌంటింగ్ కేంద్రం మంజూరుకు ఆర్‌వో శ్రీనివాసరెడ్డి చేసిన ప్రయత్నాలు సఫలం అయ్యాయి. ఫలితంగా గచ్చిబౌలిలోని స్టేడియంలోనే ఈ సారి ఓట్ల లెక్కింపు సైతం సజావుగా సాగింది. ఆర్‌వో శ్రీనివాసరెడ్డి ఏఆర్‌వోలతో పాటు ఇతర అన్ని స్థాయిల అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయ పరుస్తూ తగు రీతిలో నిర్దేశనలిచ్చి ముందుకు నడిపిన తీరు ప్రక్రియ విజయవంతానికి ఎంతో దోహదపడింది. నియోజకవర్గానికి ఐఏఎస్ అధికారిణి శ్వేత గుప్తా సాధారణ పరిశీలకురాలిగా రావటం.. ఆర్‌వో వారితో సమన్వయంతో ఏ చిన్న లోటు లేకుండా ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేశారు. రాజకీయ పక్షాలు సైతం ఎన్నికల నిర్వహణలో తమ తోడ్పాటును అందించటం ప్రక్రియ విజయవంతానికి దోహదపడింది. నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్ ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తవటం అత్యంత సంతోషకరమని నియోజకవర్గ ఎన్నికల అధికారి(ఆర్‌వో) శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియలో తమతో పాటు ఎంతో శ్రమించిన అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బందికి ఆర్‌వో ధన్యవాదాలు తెలిపారు. రాజకీయపక్షాలు సైతం హుందాగా వ్యవహరించి తమకు ఎంతో తోడ్పాటును అందించాయని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు

సీర యేసు
(ఫైల్)

మాదాపూర్, డిసెంబర్ 4: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగిరాకపోవడంతో అతని భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటన సోమవారం మాదాపూర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరంకు చెందిన సీర యేసు (28) బతుకుదెరువు నిమిత్తం గత 7 సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వలసవచ్చి సిద్ధిక్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటూ మెడిసిన్ డెలివరీ బాయ్‌గా చేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి రెండు రోజులు గడుస్తున్నా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తున్నది. దీంతో అతని భార్య మాలతి మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అతనికి భార్య, ఓ కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు. వ్యక్తి గురించి ఏదైనా ఆచూకీ లభించినట్లయితే మాదాపూర్ పోలీస్ స్టేషన్ 8331013220 గల నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలుసులు కోరారు.